ఐటీసీలో 'గుర్తింపు' పోరు

బీఆర్‌టీయూ మేనిఫెస్టో చూపుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు (ఫైల్)

బూర్గంపహాడ్, జనవరి 29: సారపాకలోని ఐటీసీ కర్మాగారంలో గుర్తింపు సంఘం ఎన్నికల పోరుకు కార్మిక సంఘాలు ప్రచారాన్ని ముమ్మరంగా సాగిస్తున్నాయి. ఈ నెల 31న ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికలు జరుగుతాయి. లేబర్ కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ ఎన్నికల్లో బీఆర్‌టీయూ-మిత్రపక్షాలు, టీఎన్‌టీయూసీ-మిత్రపక్షాలు, ఐఎన్‌టీయూసీ-మిత్రపక్షాలు, ఏఐటీయూసీ, బీఎంఎస్ తదితర సంఘాలు పోటీ చేస్తున్నాయి. బీఆర్‌టీయూ-మిత్రపక్షాలు, ఐఎన్‌టీయూసీ-మిత్రపక్షాలు, టీఎన్‌టీయూసీ-మిత్రపక్షాల మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. మొత్తం 1253 మంది ఓటర్లు ఉన్నారు.

శ్రీరాంపురంలో రోడ్డుకు ప్రతిపాదనలు

అధికారులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

బూర్గంపహాడ్, జనవరి 29: మండలంలోని సారపాక పంచాయతీ మారుమూల గిరిజన గ్రామమైన శ్రీరాంపురం ఎస్టీ కాలనీకి రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ తెలిపారు. పాయన బుధవారం శ్రీరాంపురం ఎస్టీ కాలనీ రహదారిని అటవీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామస్తులతో పీవో మాట్లాడుతూ.. అటవీ శాఖ నుంచి అనుమతులు రాగానే నిర్మాణం చేపడతామన్నారు. శ్రీరాంపురం ఎస్టీ కాలనీకి రోడ్డు లేకపోవడంతో ఎదురవుతున్న సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. వీటిని పరిష్కరించేందుకే రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అటవీ అధికారుల నుంచి క్లియరెన్స్ కోసం 2.37 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. మంచినీటి ట్యాంకుల నిర్మాణం పూర్తయితే సోలార్ కనెక్షన్ ఇప్పిస్తామన్నారను. ఏపీవో (జనరల్) డేవిడ్‌రాజ్, తహసీల్దార్ ముజాహిద్, ఎఫ్‌డీవో మసూద్, ఎంపీవో సునీల్‌శర్మ, సారపాక ఈవో కంది మహేష్, ఎఫ్ఆర్‌వో రమేష్, ఆర్ఐ నర్సింహారావు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, జనవరి 29: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకులు బుధవారం నిత్య కల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామి వారికి సుప్రభాతం పలికారు. ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్యబలిహరణం తదితర పూజాది కార్యక్రమాల అనంతరం నిత్య కల్యాణం నిర్వహించారు.

విశ్వబ్రాహ్మణ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ వివేక్

పాల్వంచ, జనవరి 29: రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ వివేక్ బుధవారం పాల్వంచలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు కాపర్తి వెంకటాచారి, వారాది సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంఘం బాధ్యులు మొగులోజు సీతారామాచారి, కాసర్ల రామారావు, నాంపల్లి వేణుగోపాలాచారి, మోత్కూరి రవి, జుజ్జూరి ప్రభాకరాచారి పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై 'చలో హైదరాబాద్'

మాట్లాడుతున్న ఆవునూరి మధు

టేకులపల్లి, జనవరి 29: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో జరుగుతున్న అవకతవకలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 20న 'చలో హైదరాబాద్' నిర్వహించనున్నట్లు సీపీఐ-ఎంఎల్ (న్యూడెమోక్రసీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి మధు తెలిపారు. ఆయన బుధవారం టేకులపల్లి మండలం బద్దుతండా గ్రామంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు కాకుండా అనర్హులకు మాత్రమే అందాయని విమర్శించారు. ఈ అవకతవకలకు వ్యతిరేకంగా జరిగే 'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, సీతారామయ్య, సారంగపాణి, ఎండి.రాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చదవాలి.. సాధించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాచందన

టేకులపల్లి, జనవరి 29: విద్యార్థులు బాగా చదివి, చక్కటి ఫలితాలు సాధించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన కోరారు. స్థానిక గిరిజన సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహాన్ని బుధవారం సందర్శించారు. సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. బాగా చదివి, ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లిదండ్రులతోపాటు కళాశాలకు మంచి పేరు తేవాలని కోరారు. ఏపీఎం రవికుమార్, ఏపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంట్రాక్ట్ కార్మిక సంఘం మహాసభ

మాట్లాడుతున్న షావలి

టేకులపల్లి, జనవరి 29: ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ (టీయూసీఐ) రాష్ట్ర రెండో మహాసభ జయప్రదం చేయాలని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకుబ్ షావలి పిలుపునిచ్చారు. సింగరేణి కేవోసీ, హైటెక్ కాలనీ కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం జర్పుల సుందర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. షావలి మాట్లాడుతూ.. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 14 నెలలు గడిచినా జీతాలు పెంచకపోవడం బాధాకరమన్నారు. ఈ నెల 30న ఇల్లెందు పట్టణంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర రెండవ మహాసభ ఎల్లన్న భవనంలో జరుగుతుందని చెప్పారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు షఫీ, సైదులు, రవి, మంగ్యా, శివయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల వ్యాప్తిపై అవగాహన కల్పించాలి

మాట్లాడుతున్న డాక్టర్ బాలాజీ

టేకులపల్లి, జనవరి 29: వ్యాధులపై పల్లె ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా క్షయ, ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బాలాజీ అన్నారు. మండలంలోని సులానగర్ పీహెచ్‌సీ సిబ్బందితో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఫిబ్రవరి 13వ తేదీ వరకు లెప్రసీ వ్యాధిపై ప్రజలకు, పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్, వైద్య సిబ్బంది నాగభూషణం, పార్వతి, దేవా, విజయ తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణపై అవగాహన ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న పశు వైద్యాధికారి బాలకృష్ణ

బూర్గంపహాడ్, జనవరి 29: జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా సారపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం మండల పశు వైద్యాధికారి బాలకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపన్యాస పోటీ విజేతలకు బహుమతులను బాలకృష్ణ అందజేశారు. హెచ్ఎం దూద, జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకుడు సత్యప్రసాద్, పశు వైద్యులు బాలకృష్ణ, రాజేందర్, ఎస్పీసీఏ సభ్యుడు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైటర్‌బస్తీలో మెగా ఆరోగ్య శిబిరం

మాట్లాడుతున్న డాక్టర్ బాలాజీ

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, జనవరి 29: కొత్తగూడెం జీజీహెచ్ సంపూర్ణ సురక్షా కేంద్రం ఆధ్వర్యంలో రైటర్‌బస్తీలోని ఆరోగ్య కేంద్రంలో బుధవారం మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలాజీ, ఏఅండ్ఎల్, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ ఆధ్వర్యంలో బాధితులకు వైద పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెచ్ఐవీ, టీబీ, షిపిలీస్, హెపిటటీస్ బీ మొదలైన వాటికి రక్త నమూనాలు సేకరించారు. వైద్యులు, అధికారులు సందీప్, రాజేందర్, సత్యకుమార్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వినతి

ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

పాల్వంచ రూరల్, జనవరి 29: గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మండలంలోని ఉపాధి హామీ సాంకేతిక సిబ్బంది కోరారు. ఈ మేరకు ఎంపీడీవో విజయభాస్కరెడ్డికి బుధవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వ కార్యక్రమాలన్నింటిలోనూ తాము ముందుండి పనిచేస్తున్నామని అన్నారు. అయినప్పటికీ తమ వేతనాల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వేతనాలు సకాలంలో అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీవో రంగా, ఇతర సిబ్బంది పుల్లయ్య, లక్ష్మణ్, రాజేశ్, నాగేశ్వరరావు, శంకర్, రాములు, శ్రీను పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతి

ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

దమ్మపేట, జనవరి 29: మూడు నెలల వేతన బకాయిలు ఇప్పించాలని కోరుతూ మండలంలోని ఉపాధి హామీ పథకం ఉద్యోగులు ఎంపీడీవో రవీందర్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. పాల బిల్లు, కూరగాయలు, ఇంటి అద్దె, పిల్లల చదువుకు ఫీజులు, బ్యాంకులో తీసుకున్న రుణాలకు ఈఎంఐలు, పెట్రోల్, బస్ కిరాయిలకు డబ్బులు లేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మండల ఉపాధి హామీ పథకం ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వేముల సుధాకర్ (ఏపీవో), కోశాధికారి పట్నాయక్ (సీవో), టెక్నికల్ అసిస్టెంట్ల సంఘం కార్యదర్శి రాఘవ, ఫీల్డ్ ఆఫీసర్ల సంఘం అధ్యక్షుడు దారా రవి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం తీవ్ర నేరం

మాదక ద్రవ్యాల దుష్పరిణామాలను వివరిస్తున్న డీఎస్పీ మధుమోహన్ రెడ్డి

అశ్వారావుపేట, జనవరి 29: మాదక ద్రవ్యాల వినియోగం తీవ్ర నేరమని, వాటి దుష్పరిణామాలతో యువత బంగారు భవిష్యత్ నాశనమవుతుందని మాదక ద్రవ్యాల నిరోధక విభాగం డీఎస్పీ మధుమోహన్ రెడ్డి హెచ్చరించారు. మాదక ద్రవ్యాల విక్రయం, వినియోగం, దుష్పరిణామాలు, చట్టాలు-శిక్షలపై స్థానిక వ్యవసాయ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ రవాణాపై టీజీ నాబ్ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డ్రగ్స్ బాధితులకు డీఅడిక్షన్ కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. డ్రగ్స్, చెడు వ్యవనాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని, చక్కటి భవిష్యత్తును సాధించాలని కోరారు. అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్ కుమార్, టీజీ నాబ్ సీఐ విజయ్ రామ్‌కుమార్, సీఐ కరుణాకర్, ఎస్సై టి.యయాతి రాజు తదితరులు పాల్గొన్నారు.

'వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలి'

సమావేశంలో మాట్లాడుతున్న సాబీర్‌పాషా

పాల్వంచ రూరల్, జనవరి 29: ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. నాగారం గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, నాగరాజు, నిమ్మల రాంబాబు, విశ్వేశ్వరరావు, వెంకన్న, గిరి, జర్పుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలో వర్క్‌షాప్

వర్క్‌షాప్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు

పాల్వంచ, జనవరి 29: పాల్వంచలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజులపాటు ఆటో వర్క్‌షాప్ నిర్వహించారు. చివరి రోజు బుధవారం జరిగిన కార్యక్రమంలో 'అసెంబ్లింగ్ కంప్యూటర్ హార్డ్‌వేర్ కాంపోనెంట్స్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక కళాశాలతోపాటు ఎస్ఆర్ఏఎస్ కొత్తగూడెం, పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (బాలురు), మణుగూరు కాలేజీల విద్యార్థులు హాజరయ్యారు. కలెక్టర్ సూచనలతో ఏర్పాటుచేసిన ఈ వర్క్‌షాప్‌లో ప్రిన్సిపాల్ అనురాధ, రీసోర్స్ పర్సన్ లెక్చరర్ దేవకి పాల్గొన్నారు.

'లక్ష డప్పుల సభను విజయవంతం చేయండి'

మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్, ఎంజేఎఫ్ నాయకులు

కొత్తగూడెం సింగరేణి, జనవరి 29: ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వచ్చే నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'లక్ష డప్పులు - వెయ్యి గొంతులు' సభను విజయవంతం చేయాలని ఎంజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెంగపొంగు సైదులు కోరారు. కొత్తగూడెం ట్రాన్సిట్ గెస్ట్‌హౌస్‌లో బుధవారం నిర్వహించిన కొత్తగూడెం నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ డప్పు చేతపట్టుకొని రావాలని కోరారు. సంఘం నాయకులు కనుకు వెంకటేశ్వర్లు, మేడి గుణ సురేశ్, వాసాల సంపత్, దాట్ల రవీందర్, శేఖర్, ప్రతాప్, రాజ్‌కుమార్, మురళి, సురేందర్, కొప్పుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ ఎకో పార్క్ మంజూరుకు వినతి

పీసీసీఎఫ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, జనవరి 29: గిరిజన నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటకు ఫారెస్ట్ సెంట్రల్ ఎకో పార్క్ మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం పీసీసీఎఫ్ దోబ్రియల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల అశ్వారావుపేటకు మున్సిపాలిటీ హోదా కల్పించినందున దీనిని పరిశీలనలోకి తీసుకోవాలని కోరారు. హైదాబాద్‌లో బుధవారం పీసీసీఎఫ్‌ను ఎమ్మెల్యే కలిసి వినతిపత్రం ఇచ్చారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించండి

మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరాచారి

దుమ్ముగూడెం, జనవరి 29: పర్యావరణంపై చిన్నతనం నుంచి అవగాహన కలిగి ఉంటే, భావి తరాలకు మంచి వాతావరణం కల్పించినట్లవుతుందని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) వెంకటేశ్వరాచారి అన్నారు. దుమ్ముగూడెంలో నేచర్ క్యాంప్‌ను బుధవారం సందర్శించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరి పరిధిలోని ప్రాంతాన్ని వారు ప్రతినిత్యం పరిశీలించి ప్రకృతికి నష్టం కలగకుండా చూడాలన్నారు. ముత్యాలమ్మ ఆలయం వద్ద పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టి, ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. జిల్లా సైన్స్ అధికారి చలపతిరావు, ఎన్‌జీసీ రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ రాజశేఖర్‌రావు, ఎంఈవో సమ్మయ్య, హెచ్ఎం కేవీ రామారావు, కేజీబీవీ ఎస్వో శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నేడు, రేపు నీటి సరఫరా నిలిపివేత'

కొత్తగూడెం అర్బన్, జనవరి 29: మున్సిపాలిటీకి తాగునీటిని సరఫరా చేసే రేగళ్ల సమీపంలోని పంపింగ్ మెయిన్ పైపులైన్ దెబ్బతిన్నందున గురు, శుక్రవారాల్లో పట్టణంలో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైపులైన్లకు మరమ్మతులు చేసిన వెంటనే నీటి సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు. పట్టణ ప్రజల సహకరించాలని కోరారు.

పాల్వంచ ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర బృందం

సీహెచ్‌సీని సందర్శించి మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

పాల్వంచ టౌన్, జనవరి 29: పాల్వంచలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కేంద్ర బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, మందులు, కల్పిస్తున్న వసతుల వివరాల గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. వివరాలను కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖకు నివేదిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర బృందం మురుగేశ్, డాక్యుమెంటేషన్ ఆఫీసర్ సునీత, రీసెర్చ్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

అశ్వారావుపేట రూరల్, జనవరి 29: మండలంలోని శివారు అటవీ ప్రాంతం పెద్దమిద్దె గిరిజనులకు నిత్యావసర సరుకులను హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ కొనకళ్ల సుధారాణి బుధవారం పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

మాట్లాడుతున్న డీఎస్పీ రవీంద్రారెడ్డి

మణుగూరు టౌన్, జనవరి 29: వాహనదారులు, పాదచారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని మణుగూరు డీఎస్పీ రవీంద్రారెడ్డి అన్నారు స్థానిక బీటీపీఎస్‌లో బుధవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో మాట్లాడారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితంగా ప్రయాణించవచ్చని అన్నారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని కోరారు. మణుగూరు సీఐ సతీష్ కుమార్, బీటీపీఎస్ సీఈ, ఎస్సీ, డీఈ, ఏఈఈలు పాల్గొన్నారు.

టీఎస్ టీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

టేకులపల్లి, జనవరి 29: టీఎస్ టీటీఎఫ్ మండల కమిటీని బుధవారం బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండా ప్రాథమిక పాఠశాలలో జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా గుగులోత్ శంకర్, ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ సురేష్, కోశాధికారిగా భూక్యా బాలాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు భూక్య మోహన్, నాయకులు హలావత్ వీరభద్రం, బాలూనాయక్, సురేష్, ప్రసాద్, సందీప్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్ రద్దు చేయాలి

మాట్లాడుతున్న జోగ రాంబాబు

ఆళ్ళపల్లి, జనవరి 29: ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్) రద్దు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మైలారం పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్, యూపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పథకం(ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు బోజ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎఈవో శాంతారావు, నాయకులు కొమరం లాలయ్య, కుమార్ రాజా, రవి, సర్వేష్, శ్రీనివాస్, సోమ్లా పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యతో చెల్లింపుల్లో జాప్యం

అశ్వారావుపేట, జనవరి 29: బ్యాంక్‌లో సాంకేతిక సమస్య కారణంగా చెల్లింపుల్లో జాప్యం చోటు చేసుకుందని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఏపీజీవీబీ.. టీజీవీబీగా మారినందున గెలల ధర చెల్లింపుల్లో సమస్య ఏర్పడిందని చెప్పారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే బ్యాంక్ అదికారులతో పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. నగదు చెల్లింపులో ఆయిల్‌ఫెడ్ తప్పిదం ఏమీ లేదని, కేవలం బ్యాంక్ సేవల్లో సాంకేతిక సమస్యే ప్రధాన కారణమని స్పష్టం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని, నగదు జమ అవుతుందని, ఇతర బ్యాంకుల ద్వారా ప్రయత్నించినా ప్రయోజనం కనిపించలేదని వివరించారు.

మాట తప్పిన కాంగ్రెస్ సర్కార్

మాట్లాడుతున్న రంగారెడ్డి

అశ్వారావుపేట, జనవరి 29: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ మాట తప్పిందని సీపీఐ-ఎమ్ఎల్ (మాస్‌లైన్) రాష్ట్ర నాయకుడు కెచ్చెల రంగారెడ్డి విమర్శించారు. ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, అర్హులైన పేదలందరికీ ప్రతి సంక్షేమ పథకం అందించాలని డిమాండ్ చేశారు. పార్టీ స్థానిక కార్యాలయంలో బుధవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకాలు అమలు చేయకుండా ప్రజలను ప్రభుత్వం మోసగిస్తున్నదని ఆరోపించారు. రైతు భరోసా రూ.15వేలు ప్రకటించి రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు సరిపోవని అన్నారు. వారికి ఏడాది పొడవునా పనులు కల్పించేలా కనీస వేతనం అమలు చేయాలని సూచించారు. నాయకులు గోకినపల్లి ప్రభాకర్, కంగాల భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై దాడికి ఖండన

రవిని పరామర్శిస్తున్న రామకృష్ణ దొర

చండ్రుగొండ, జనవరి 29: మండలంలోని బెండాలపాడు గ్రామంలో ఇటీవల కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడి, చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కొడెం రవిని ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర బుధవారం పరామర్శించారు. దాడి కారణాలను తెలుసుకున్నారు. దాడిని ఖండించారు. ఆదివాసీలపై దాడులు చేసే రాజకీయ పార్టీలను గ్రామాల్లోకి రానివ్వబోమని, వాటికి కొమ్ముగాసే నాయకులకు గుణపాఠం చెబుతామని అన్నారు. తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ పాల్గొన్నారు.

ఎనిమిదిమంది జూదరుల అరెస్ట్

జూలూరుపాడు, జనవరి 29: పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఎనిమిదిమంది జూదరులను స్థానిక పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని అన్నారుపాడు గ్రామ సమీపంలో కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై భాదావత్ రవి.. తన సిబ్బందితో కలిసి సదరు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎనిమిది మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,100 నగదును, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.